

సమస్యల పరిష్కారం కోరుతూ నిరవధిక సమ్మె చేపట్టిన అంగన్‌వాడీల వేతనాల్లో కోత పడింది. దీనిపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిసెంబరులో 9 రోజులు విధులకు హాజరు కాకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చే రూ.11,500 వేతనంలో రూ.3,500 కోత విధించారు. మిగిలిన రూ.8వేలు కార్యకర్తల ఖాతాల్లో జమ అవుతాయని సందేశాలు వచ్చాయి. అంతంతమాత్రం వేతనంతో నెట్టుకొస్తున్న అంగన్‌వాడీలకు ఈ కోతతో తీవ్ర ఇబ్బందులు తప్పేలా లేవు.

- హిందూపురం అర్బన్

జీతం కోతపై కుతకుత

అంగన్‌వాడీల వేతనంలో కోత



ఇచ్చేది రూ.11500..
కటింగ్ రూ.3500..

వచ్చేనెల పూర్తిగా కోత తప్పదా..?

అయోమయంలో కార్యకర్తలు, సహాయకులు..

అంగన్‌వాడీలు వచ్చే చాలీచాలని వేతనంతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. పిల్లల చదువులు, కుటుంబ పోషణ, ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు తదితరాలన్నింటికీ వేతనమే దిక్కు. అనారోగ్య సమస్యలు, అనుకోని ఖర్చులు వస్తే అప్పులు చేయాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఇస్తున్న చాలీచాలని వేతనంలో కూడా కోత విధించింది. అంగన్‌వాడీ కార్యకర్తకు నెలకు రూ.11,500 వేతనం అందుతోంది. సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబరు 12వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. రోజూ వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారు. ప్రతి నెలా 20 నుంచి తరువాతి నెల 20వ తేదీ వరకు నెలగా పరిగణిస్తూ అంగన్‌వాడీలకు వేతనం చెల్లిస్తారు. అందులో భాగంగా నవంబరు 20 నుంచి డిసెంబరు 20 వరకు పనిదినాలను లెక్కగట్టి జనవరిలో వేతనం చెల్లిస్తారు. డిసెంబరు 12 నుంచి అంగన్‌వాడీలు సమ్మెలోకి వెళ్లడంతో 9 రోజులపాటు గైర్హాజరైనట్లు చూపుతూ వేతనంలో రూ.3,500 కోత పెట్టారు. మిగిలిన రోజులకు సంబంధించి రూ.8 వేలు వేతనం కార్యకర్తలకు అందనుంది. రూ.8 వేలతో కుటుంబ అవసరాలు ఎలా తీర్చుకోవాలోనని కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. ఇక, వచ్చేనెల పూర్తి జీతం కోత పడనుండడంపై వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ 28 రోజులుగా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదని అంగన్‌వాడీలు మండిపడుతున్నారు. పైగా ఎస్మా చట్టం ప్రయోగిస్తోందని ఆందోళన చెందుతున్నారు. అంగన్‌వాడీల్లో చాలామందికి వేతనమే జీవనాధారం. జీతం అందితేనే ఇల్లు గడిచేవారు లేకపోలేదు. వారి వేతనాలపై తల్లితండ్రులు కూడా ఆధార పడి ఉంటారు. ఒంటరి మహిళలు, వితంతువులు కూడా ఉన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం జీతాల్లో కోత విధించడం శోచనీయం. అడగనే జీతం పెంచుతామనీ, తెలంగాణ కన్నా ఎక్కువగా చెల్లిస్తామని హామీలు గుప్పించిన సీఎం జగన్.. ఇప్పుడు నెత్తీనోరు కొట్టుకుంటున్నా స్పందించకపోవడంపై అంగన్‌వాడీలు ఆగ్రహిస్తున్నారు.

అమ్మను ఎలా పోషించుకోవాలి?

నేను ఒంటరి మహిళను, దివ్యాంగురాలిని. అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నా. అమ్మ కూడా నావద్దే ఉంటోంది. అమ్మను చూసుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. నాకు అమ్మ తోడు, ఆమెకు నేను తోడు. జీతంపైనే ఆధారపడి బతుకుతున్నాం. ఇంటి అద్దె కట్టుకుని, మిగిలిన జీతంతో బతుకులు నెట్టుకొస్తున్నాం. ఇలాంటి సమయంలో జీతంలో కోత విధిస్తే బతికేదెలా?

- ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్త, కిరికెర





అద్దె ఎలా కట్టుకోవాలో..?

కొంతకాలం క్రితం భర్త మృతి చెందాడు. ఒంటరి జీవనం సాగిస్తున్నా. అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నా. వచ్చిన జీతంలో ఇంటి అద్దెపోను.. మిగిలినది పోషణకు వినియోగిస్తున్నా. అనారోగ్య సమస్య తలెత్తితే అప్పు చేయాల్సి వస్తోంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వం జీతంలో కోత విధిస్తే నా పరిస్థితి ఏంటి?

- పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్త, మీనకుంటపల్లి

వైసీపీ కార్యాలయంలో బాహాబాహీ

- తన్నుకున్న చిలమత్తూరు మండల నాయకులు
- మంత్రి పురంలో ఉండగానే ఘటన
- మండల నాయకుడిపై దుర్భాషలాడిన వేణురెడ్డి
- చక్కదిద్దేందుకు ఓ వర్గం నాయకులతో మంత్రి దూతల సమావేశం





హిందూపురం వైసీపీ కార్యాలయంలో పరస్పరం దాడులు చేసుకుంటున్న నాయకులు



హిందూపురంలో కోల్డ్ స్టోరేజీ వద్ద ఉన్న చిలమత్తూరు మండల నాయకులు

హిందూపురం, జనవరి 9: నియోజకవర్గంలో అధికార పార్టీలో నెలకొన్న అసమ్మతిని చక్కబెట్టి వర్గపోరు లేకుండా చేయడానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డే రంగంలోకి దిగారు. వర్గపోరు తగ్గించిన మాటేమోగానీ.. ఆయన హిందూపురంలో ఉండగానే చిలమత్తూరు మండలానికి చెందిన రెండువర్గాల నాయకులు పురంలోని వైసీపీ కార్యాలయంలో తన్నుకున్నట్లు తెలిసింది. మంగళవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో చిలమత్తూరు మండలంలో మంత్రి పర్యటనపై చర్చించేందుకు చిలమత్తూరు మండలానికి చెందిన ఇరువర్గాల నాయకులు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీ జగన్మోహన్ రెడ్డి, నాయకులు నాగరాజు యాదవ్, రాజారెడ్డి, మరికొంత మంది అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంలో మండల కన్వీనర్ విషయంపై చర్చించాలనీ, ప్రస్తుతం ఉన్న వ్యక్తికి కాకుండా మాజీ కన్వీనర్‌కి ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఎంపీపీతోపాటు ఆయన వర్గీయులు ఇందుకు ససేమిరా అన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వారి మధ్య మాటామాటా పెరిగింది. ఓ వర్గం నాయకులు ముందస్తు ప్రణాళిక ప్రకారం గొడవ పెట్టుకున్నట్లు మరో వర్గం అక్కడే ఆరోపించినట్లు సమాచారం. ఈ దశలో చిలమత్తూరు మండలానికి చెందిన ఒక నాయకుడిని నియోజకవర్గ సమన్వయకర్త దీపిక భర్త వేణురెడ్డి దుర్భాషలాడుతూ పార్టీ కార్యాలయం నుంచి బయటికి గెంటేసినట్లు సమాచారం. వేణురెడ్డి దౌర్జన్యంపై వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిసింది. పార్టీ కోసం పనిచేస్తున్న తమపై ఇలా ప్రతాపం చూపుతున్నారనీ, ఎంతకష్టపడినా ఇంతేనా అంటూ వారు మంత్రి దూతల ముందు ఆవేదన వ్యక్తంచేసినట్లు సమాచారం. కార్యాలయంలో కేకలు వేస్తుండటంతో స్థానికులు గుమికూడారు. దీంతో నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై చర్చించేందుకు నాగరాజు యాదవ్, జగన్మోహన్ రెడ్డి, రాజారెడ్డి, నరసింహారెడ్డి మరికొంత మందితో నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాలరెడ్డి కోల్డ్ స్టోరేజీలో గంటపాటు చర్చలు సాగించారు. ఆ నాయకులు తాడోపేడో తేల్చుకుందామని బయటికి వచ్చేశారు. మంత్రి దూతలు సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చిలమత్తూరు మండలంలో ఈనెల 12, 13 తేదీల్లో మంత్రి పర్యటన ఉంది. ఇప్పుడే ఇలా ఉంటే మంత్రి పర్యటన సమయంలో ఎలా ఉంటుందో వేచి చూడాలి.

రేపు సత్యసాయి విద్యార్థుల స్పోర్ట్స్‌మీట్

పుట్టపర్తి, జనవరి 9: శ్రీసత్యసాయి విద్యాసంస్థల విద్యార్థుల స్పోర్ట్స్‌మీట్ ఈనెల 11న స్థానిక హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం విద్యార్థులు రిహార్సల్స్ చేపట్టారు. స్పోర్ట్స్‌మీట్ నిర్వహణకు స్టేడియంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం 8 గంటలకు స్పోర్ట్స్‌మీట్ ప్రారంభంకానుంది. సత్యసాయి యూనివర్సిటీ పరిధిలోని ప్రశాంతినిలయం, బెంగళూరులోని బృందావన్, కర్ణాటకలోని ముద్దెన హళ్లి, అనంతపురంలోని మహిళా కళాశాల విద్యార్థులు పాల్గొంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 12నుంచి 15వ తేదీ వరకు ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



పుట్టపర్తిలో జైల్ భరో కార్యక్రమం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



అంగన్‌వాడీల శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

ఎస్మా ప్రయోగిస్తే జగన్‌కు ఆస్తమా తెప్పిస్తాం

- సీఐటీయూ నాయకుల హెచ్చరిక

పుట్టపర్తిరూరల్, జనవరి 9: సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె నిర్వహిస్తున్న అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగిస్తే ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి ఆస్తమా తెప్పిస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 29వ రోజుకు చేరుకుంది. పుట్టపర్తిలోని ఆర్డీఓ కార్యాలయం ముందు సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేసు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు బడా సుబ్బిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు దిల్షాద్ ఆధ్వర్యంలో వినూత్నంగా పూర్ణకుంభాలతో అంగన్‌వాడీలు కదిలిరాగా.. జైల్ భరో కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ, సీపీఎం, ఎస్ఎఫ్ఐ, ఐద్వా నేతలు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని ఉద్ఘాటించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి పుట్టపర్తి అర్బన్ పోలీసు స్టేషన్ ముందు జైల్‌భరో కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లాలోని ముదిగుబ్బ, నంబులపూలకుంట, కదిరి, ఓబుళదేవరచెరువు, నల్లమాడ, హిందూపురం, ధర్మవరం, బత్తలపల్లి, లేపాక్షి, చిలమత్తూరులో అంగన్‌వాడీల నిరసనల హోరు కొనసాగింది.

సైకో ముఖ్యమంత్రికి పౌష్టికాహారం అందించాలి

ఈ ప్రభుత్వంలో అందరూ రోడ్డెక్కారు.. అంగన్‌వాడీలకు ఎమ్మెల్యే బాలయ్య మద్దతు

హిందూపురం: సైకో ముఖ్యమంత్రి జగన్‌కే పౌష్టికాహారం అందించాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. మంగళవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతుగా శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు రోడ్డెక్కారన్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నించినా.., న్యాయం కోసం పోరాటం చేసినా కేసులు బనాయిస్తున్నారన్నారు. అన్నివర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. అన్నివ్యవస్థలను సర్వనాశనం చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజినప్ప, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ లక్ష్మి, టీడీపీ పట్టణాధ్యక్షుడు రమేష్, నాయకులు నాగరాజు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల సమీక్షలో కలెక్టర్, ఎస్పీ



పుట్టపర్తి, జనవరి 9: కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం విజయవాడలో నిర్వహించిన ఎన్నికల సమీక్షలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి పాల్గొన్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు ముందస్తు ఏర్పాట్లపై జిల్లాలో కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు.. జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంల గోడౌన్లు, పోస్టల్ బ్యాలెట్, కౌంటింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల్లో వసతులు, ప్రక్రియ, ఓటరు జాబితాపై తీసుకున్న చర్యలను వివరించారు. ఎన్నికల సందర్భంగా బందోబస్తు నిర్వహణ, సమస్యాత్మక గ్రామాల భద్రతపై ఎస్పీ మాధవరెడ్డి వివరించారు.

సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ఉషశ్రీ.. నీ ఆటలు పెనుకొండలో సాగవ్..

మంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలపై సవిత ఫైర్



కార్యకర్తలతో మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, జనవరి 9: స్థానికుల మధ్య చిచ్చుపెట్టే రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ ఆటలు పెనుకొండలో సాగవని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణ పరిధి మడకశిర రోడ్డులో ఎమ్మెల్యే శంకర్‌నారాయణ, స్థానికులతో మంత్రి సమావేశమైన విషయం విదితమే. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ.. వైసీపీ నాయకులపై టీడీపీ వారు చేయి వేయాలంటే ముందు తనను దాటుకుని వెళ్లాలంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. దీనిపై సవిత కౌంటర్ ఇచ్చారు. స్థానిక అన్న క్యాంటీన్‌లో మంగళవారం సవిత మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఉన్న పెనుకొండలో మంత్రి ఉషశ్రీ వ్యాఖ్యలు చిచ్చుపెట్టేలా ఉన్నాయన్నారు. కళ్యాణదుర్గంలో అభివృద్ధి చేసి ఉండుంటే ఉషశ్రీ అక్కడే ఎన్నికల్లో పోటీ చేసేవారనీ, పెనుకొండకు రావాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కళ్యాణదుర్గంలో ఏ వైసీపీ కార్యకర్తను అడిగినా ఉషశ్రీ అవినీతి కథలు చెబుతారన్నారు. అక్కడ డిపాజిట్లు కూడా రావని తెలిసే ఉషశ్రీ ఇక్కడకు వచ్చారనీ, వచ్చీరాగానే స్థానికుల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారన్నారు. వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన అంగన్‌వాడీలను పోలీసులతో దౌర్జన్యంగా పక్కకు తోయించిన ఘనత ఉషశ్రీకి దక్కుతుందన్నారు. సొంత శాఖకు చెందిన సిబ్బంది పట్ల ఇంత నిర్లక్ష్యం చూపడం ఏంటని ప్రశ్నించారు. కళ్యాణదుర్గంలో మాట వినని వారిపై ఎస్సీ, ఎస్టీ వేధింపులు, అక్రమ మద్యం కేసులు పెట్టించడం ఉషశ్రీకే చెల్లిందని మండిపడ్డారు. అక్కడ డిపాజిట్లు రావని పెనుకొండకు మకాం మార్చిన ఉషశ్రీని ఇక్కడ కూడా ఇంటికి పంపించడానికి నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరి జోలికి వెళ్లరనీ, తమ శ్రేణులపైకి వస్తే ఉపేక్షించేంది లేదని సవిత ఘాటుగా హెచ్చరించారు.

టిక్కెట్టు ఫైట్..!

పుట్టపర్తిలో శ్రీధర్‌రెడ్డికి ఇస్తే ఓడిస్తాం

ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా ఒక్కటైన అసమ్మతి నేతలు

కదిరిలో మాజీ ఎమ్మెల్యే ఇంట్లో సమావేశం

మంత్రి పెద్దిరెడ్డి వద్దకు పంచాయితీ

తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయానికి దుద్దుకుంట

పుట్టపర్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికార పార్టీలో టిక్కెట్ల మంటలు చెలరేగుతున్నాయి. పుట్టపర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తే సహకరించే ప్రసక్తే లేదని అసమ్మతి నేతలు గళం విప్పారు. తమ మాట పరిగణనలోకి తీసుకోకుండా మళ్లీ శ్రీధర్‌రెడ్డినే బరిలోకి దింపితే ఓడిస్తామనీ, అవసరమైతే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. కొన్నాళ్లుగా పుట్టపర్తి సిట్టింగ్ ఎమ్మెల్యేపై సొంత పార్టీ నేతలే తిరుగుబావుటా ఎగుర వేస్తుండగా.. అసమ్మతి ముసలం పుట్టుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో శ్రీధర్‌రెడ్డికి అవకాశం ఇవ్వద్దనీ, కొత్త అభ్యర్థిని తీసురావాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. ఈనేపథ్యంలోనే మంగళవారం కదిరిలో మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి నివాసంలో పుట్టపర్తి టిక్కెట్టు ఆశిస్తున్న వైసీపీ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త సోమశేఖర్ రెడ్డి, నాయకులు పాముదుర్తి ఇంద్రజిత్‌రెడ్డి, లోచర్ల విజయభాస్కర్ రెడ్డి, వైద్యుడు దేశాయి నాగేంద్రకుమార్‌రెడ్డి సమావేశమయ్యారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వ్యతిరేకంగా ఒక్కటై సుదీర్ఘంగా చర్చించారు. టిక్కెట్టు ఆశిస్తున్న నేతలంతా ఒకే వేదికపైకి రావడంతో పుట్టపర్తి వైసీపీలో రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డితో కదిరిలో పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సమావేశమై, తనకు మద్దతుగా నిలవాలని, నియోజకవర్గంలో 193 చెరువులకు నీరిచ్చే కార్యక్రమ ప్రారంభోత్సవానికి రావాలని కోరారు. తాజాగా టిక్కెట్టు ఆశిస్తున్న నేతలు.. మోహన్‌రెడ్డి నివాసంలో అత్యవసర సమావేశమవడంతో పుట్టపర్తి వైసీపీలో ఏం జరుగుతోందనన్న చర్చకు తెరలేచింది. దిద్దుబాటు పేరుతో రాష్ట్రంలో అధికార పార్టీ సిట్టింగ్ ఎంపీ, ఎమ్మెల్యేల చేర్పులుమార్పులతో ప్రకటించిన రెండో జాబితాలో జిల్లాలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌తోపాటు కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డిపై వేటుపడింది. పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే శంకర్‌నారాయణను పొగబెట్టి పొరుగున అనంతకు సాగనంపారు. రేపోమాపో మూడో జాబితాలో మరి కొన్ని సిట్టింగ్‌ల పేర్లుండే ప్రచారం నేపథ్యంలో పుట్టపర్తి ఎమ్మెల్యేకి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్టు ఇవ్వద్దని సొంత పార్టీ నేతలే అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. వారం కిందట సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి అవకాశం ఇవ్వద్దని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లోచర్ల విజయభాస్కర్ రెడ్డి బహిరంగంగానే సంచలన వ్యాఖ్యలు చేయడం అధికార పార్టీలో దుమారం రేపింది. తాజాగా టిక్కెట్టు ఆశిస్తున్న నేతలు కదిరిలో మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి ఇంట్లో సమావేశమవడంతో శ్రీధర్‌రెడ్డిపై అసమ్మతి పోరు ఉధృతం పెంచారు. పార్టీ నేతలు, కార్యకర్తల అభీష్టానికి వ్యతిరేకంగా అధిష్టానం సిట్టింగ్ ఎమ్మెల్యేకే మళ్లీ అవకాశం ఇస్తే మూకుమ్మడిగా రాజీనామాలు చేయడంతోపాటు అవసరమైతే కాంగ్రెస్‌లో చేరే అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. పుట్టపర్తి ఎమ్మెల్యేపై సొంత పార్టీ నేతల తిగుబాట్ల నేపథ్యంలో వైసీపీ క్యాడర్‌లో అయోమయం నెలకొంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లడం పుట్టపర్తిలో చర్చనీయాంశంగా మారింది.



మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన పుట్టపర్తి వైసీపీ నేతలు

శ్రీధర్‌రెడ్డికి ఇస్తే సహకరించేదే లే..

హిందూపురం పర్యటనలో ఉన్న పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుట్టపర్తి టిక్కెట్టు ఆశిస్తున్న సోమశేఖర్‌రెడ్డి, పాముదుర్తి ఇంద్రజిత్‌రెడ్డి, లోచర్ల విజయభాస్కర్‌రెడ్డి, వైద్యుడు దేశాయి నాగేంద్రకుమార్‌రెడ్డి కలిశారు. పార్టీ అవిర్భావం నుంచి జెండా మోసిన కార్యకర్తలు, నేతలను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఏనాడూ పట్టించుకున్న పాపానపోలేదన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుచరుల భూకబ్జాలు, సెటిల్మెంట్లు పెరిగిపోయాయనీ, సొంత పార్టీ నేతలపై తప్పుడు కేసులు పెట్టించి పార్టీని నడిరోడ్డుపై నిలబెట్టారని మళ్లీ ఎలా టిక్కెట్టు ఇస్తారని అసమ్మతి నేతలు.. మంత్రి పెద్దిరెడ్డికి ఫిర్యాదు చేసి, నిలదీసినట్లు తెలిసింది. శ్రీధర్‌రెడ్డి వద్దంటూ పార్టీ క్యాడర్ కోరుకుంటున్నా.. మళ్లీ తనకే టిక్కెట్టు అంటూ ఆయన అహంకార ధోరణి ప్రదర్శిస్తున్నారనీ, గెలిచే ప్రసక్తే లేదన్నారు. కొత్తవారికి ఎవరికిచ్చినా కలిసి పనిచేసి, గెలిస్తామనీ, శ్రీధర్‌రెడ్డిని పక్కనబెట్టి బలమైన అభ్యర్థిని ఎంపిక చేయడంపై అధిష్టానం ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. ఏకపక్షంగా మళ్లీ దుద్దుకుంటకు అవకాశమిస్తే తమదారి తాము చూసుకుంటామని తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. పుట్టపర్తి ఇంకా ఫైనల్ కాలేదని ఈనెల 20 తరువాత తనతో వస్తే సీఎంను కలుపుతాయని అందాకా బహిరంగంగా మట్లాడవద్దని అసమ్మతి నేతలకు మంత్రి సూచించినట్లు తెలుస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చవద్దంటూ కదిరి పెనుకొండలో పార్టీ శ్రేణులు.. అధిష్టానానికి హెచ్చరికలు చేస్తూ రాజీనామాల అస్త్రం ప్రయోగించారు. అయినా అధిష్టానం ముందుకెళ్లి హిందూపురం ఎంపీ, పెనుకొండ, కదిరి సిట్టింగ్‌లను మార్చేసింది. డబ్బున్న వారికే టిక్కెట్టు అంటూ స్థానికేతరులైన బళ్లారి బీజేపీ మాజీ ఎంపీ శాంతను హిందూపురం ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేసి, రంగంలోకి దింపింది. పెనుకొండ, కదిరి సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చవద్దంటూ పార్టీ శ్రేణులు నిరసన చేపడితే పుట్టపర్తిలో మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యేకి మళ్లీ అవకాశం ఇవ్వద్దన్న డిమాండ్లు తెరపైకి వచ్చాయి. పుట్టపర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే మాత్రం ఈసారి తానే అంటూ పాదయాత్రకు సిద్ధమౌతున్నారు. పుట్టపర్తిలో టిక్కెట్టు ఆశిస్తున్న నేతల అభిప్రాయాలను వైసీపీ అధిష్టానం పరిగణనలోకి తీసుకుంటుందా, మూడో జాబితాలో కొత్తపేరు తెరపైకి వస్తుందా..? ఎవరిది పైచేయి అవుతోందనన్న చర్చ సాగుతోంది.



సాష్టాంగ నమస్కారం చేస్తూ శ్రీరామిరెడ్డి కార్మికుల నిరసన

ఆగని శ్రీరామిరెడ్డి కార్మికుల ఆందోళన

● 325 గ్రామాలకు నిలిచిపోయిన తాగునీటి సరఫరా

కళ్యాణదుర్గం, జనవరి 9 : తమ డిమాండ్లు నెరవేర్చాలని శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు చేపట్టిన ఆందోళనలు 9వ రోజుకు చేరాయి. కార్మికులతో అధికారులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. మంగళవారం పంప్‌హౌస్‌కు తాళాలు వేసి, సాష్టాంగ నమస్కారం చేస్తూ వినూత్న రీతిలో నిరసన చేపడుతూ, ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా కార్మికులు నినాదాలు చేశారు. పేస్-4 కింద ఉన్న కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో 225 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె ప్రభావంతో సుమారు 325 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. దీంతో పలు గ్రామాల్లో దాహార్తి నెలకొంది. 15 ఏళ్లుగా ఈ పథకంలో కార్మికులుగా పనిచేస్తున్నామని నెలనెలా జీతాలు, ఇతరత్రా ప్రయోజనాలు కల్పించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు వాపోయారు. 5 నెలలుగా జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మెను విరమించేది లేదని, ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

అనంతపురం కల్చరల్, జనవరి 9 : ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం డిపో ఆధ్వర్యంలో బుధవారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతపురం డీఎం నాగభూపాల్ మంగళవారం ఓ ప్రకటనలో మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులు తమ సందేహాలు నివృత్తి చేసుకోవడంతో పాటు, ఏవైనా ఫిర్యాదులుంటే డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో తెలియజేయవచ్చన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య 08554 248553 లేదా 99592 25853 నెంబర్‌ను సంప్రదించి మాట్లాడవచ్చన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం టౌన్ జనవరి9 : ఉమ్మడి అనంతపురం జిల్లాలో 104లో డ్రైవర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్ల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మేనేజరు క్రిష్ణమూర్తి మంగళవారం ప్రకటించారు. డ్రైవర్ పోస్టులకు డ్రైవర్ హెవీ లైసెన్స్, టెన్త్‌పాస్, ఐదుసంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఏదైనా డిగ్రీ. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు బయోడేటాతో పాటు దరఖాస్తులను జిల్లా ఆస్పత్రి ఆవరణంలో ఉన్న 104 ఆఫీస్‌లో అందజేయాలని సూచించారు. వివరాలకు 91770 02479 నంబరును సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు.

చేతులెత్తేసిన జగన్!



జేఎన్‌టీయూ కళాశాల

● ఇప్పటికీ విడుదల కాని ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్

● ప్రారంభమైన మొదటి సెమిస్టర్ పరీక్షలు... హాల్ టికెట్లు ఇవ్వని యాజమాన్యాలు

● సీఎం జగన్‌పై మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



అనంతపురం సెంట్రల్, జనవరి 9: ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు కళాశాల ట్యూషన్ ఫీజును రీయింబర్స్‌మెంట్, హాస్టల్ ఫీజును స్కాలర్‌షిప్ రూపంలో గత ప్రభుత్వాలు చెల్లిస్తూవచ్చాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు వారిపిల్లల చదువులకు ఫీజుల బెంగ లేకుండా ఉండేవారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని జగన్ విద్యా దీవెనగా, స్కాలర్‌షిప్‌ను జగన్ వసతి దీవెనగా పేర్లు మార్చారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమచేసి వారిలో బాధ్యత పెంచుతామని, ఏడాది ఫీజును నాలుగు విడుతలుగా చెల్లిస్తామని గొప్పలు చెప్పారు. ఈ మేరకు సకాలంలో చెల్లించకుండా మధ్యమధ్యలో కొన్ని విడతలను ఎత్తివేశారు. అయితే 2023-24 విద్యా సంవత్సరం ప్రవేశాలు పొంది నెలలు గడుస్తున్నా నేటికీ విద్యా దీవెన, వసతి దీవెన మొత్తాలను చెల్లించకుండా సీఎం చేతులెత్తేశాడు. డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రథమ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్స్ ఇస్తామని, మెస్‌బిల్స్ కడితేనే పరీక్షలు రాయిస్తామని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హుకుం జారీ చేస్తున్నాయి. కొద్దిరోజుల్లో జగన్‌కు సీఎం పదవీ కాలం ముగుస్తుండటంతో వచ్చే ప్రభుత్వ మే మీకు ఫీజులు చెల్లిస్తుంది. ఇక నేనివ్వలేనని చేతులెత్తాశాడంటూ విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. కన్వీనర్ కోటాలో సీటువచ్చింది. మా పిల్లలకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందని అనుకుంటే.. ప్రభుత్వంతో మాకు సంబంధంలేదని ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలు నిర్వహిస్తామని కళాశాలల యాజమాన్యాలు ముక్కుపిండి వసూలు చేయడం జగన్ చేతకాని తనానికి నిదర్శనం కాదా అని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలాగే వచ్చే ప్రభుత్వం ఫీజులభారాన్ని తప్పిస్తుందని పేర్కొంటున్నారు.

జేఎన్‌టీయూ, ఎస్కేయూ పరిధిలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల సంఖ్య

కోర్సులు	విద్యార్థులు
ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్	1818
ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్	7199
మెకానికల్ ఇంజనీరింగ్	804
సివిల్ ఇంజనీరింగ్	974
కంప్యూటర్ ఇంజనీరింగ్	18913
బీ ఫార్మసీ	2930
ఫార్మాడి	619
బీఏ	1692
బీకామ్	8889
బీఎస్సీ	7630
బీబీఏ	1895
బీసీఏ	249
లా కోర్సులు	700
మొత్తం	54312

54,312 మంది విద్యార్థులు...

జేఎన్‌టీయూ పరిధిలో అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు ఉమ్మడి జిల్లాల్లో 184 ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలున్నాయి. అదేవిధంగా ఎస్కేయూ ఆధ్వర్యంలో 87 డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిలో అధికారిక లెక్కల మేరకు 54312మంది విద్యార్థులు కన్వీనర్ కోటా కింద డిగ్రీ, బీటెక్, ఫార్మసీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ విద్యా దీవెన, వసతి దీవెన సొమ్మును ప్రభుత్వమే చెల్లించాలి. ప్రథమ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కావడంతో ఫీజులు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను డిమాండ్ చేస్తున్నాయని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వం చెల్లించకుంటే సీఎం జగన్‌ను ప్రశ్నించాల్సిన యాజమాన్యాలు పరీక్షల నిర్వహణ పేరుతో విద్యార్థులపై ప్రతాపం చూపుతున్నాయని, ఇలాంటి పరిస్థితులకు కారణం సీఎం జగన్ మాత్రమేనని పేర్కొంటున్నాయి.

ఆవేదన చెందవద్దు...



రానున్న కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి ఫీజులు చెల్లించే బాధ్యత తీసుకుంటుంది. విద్యార్థులెవరూ ఆవేదన చెందవద్దు. టీడీపీ జాతీయ కార్యదర్శి నారాలోకేశ్ యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజుల ఆలోచన లేకుండా నేరుగా కళాశాలకే చెల్లించేది. దీంతో హాల్‌టికెట్స్, పరీక్షల అంశాల్లో సమస్యల్లేకుండా చదువుపైనే దృష్టిసారించేవారు.

-పరశురాం, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చేతగాని సీఎంగా జగన్...



విద్యార్థులకు సకాలంలో ఫీజులు చెల్లించకుండా వారిని మానసికంగా కుంగదీస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి చేతగాని సీఎంగా నిలిచిపోయాడు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెనగా తనపేరు పెట్టుకున్నా.. నిధులు ఇవ్వకుండా నాలుగేళ్లుగా విద్యార్థులను వేధిస్తున్నాడు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులే కాయ, కష్టంచేసి ఫీజులు చెల్లిస్తున్నారు.

-వేమన, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు



ప్రథమ సెమిస్టర్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఇక రానట్లేనా...?

కొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి. అంతకుముందే ఎన్నికల కోడ్‌వస్తుంది. ఈ నేపథ్యంలో సీఎం జగన్.. తన మంది మార్బలాన్ని సమకూర్చుకోవడం, మార్పులు, చేర్పులు చేపట్టడం తదితర ఎన్నికల ప్రక్రియలో మునిగిపోయి ఫీజుల చెల్లింపు అంశాన్ని విస్మరించాడు. విద్యా దీవెన, వసతి దీవెన మొత్తాలు ఇక రానట్లేనని స్పష్టమౌతోంది. దీంతో తమ పిల్లల చదువు మధ్యలో ఆగిపోకూడదని కాయ, కష్టంచేసి తామే సొంతంగా ఫీజులు చెల్లిస్తున్నామని తల్లిదండ్రులు చెబుతున్నారు. మేనమామగా మీ పిల్లలను నేను చదివిస్తానని ఎన్నికల్లో చెబితే సంబరపడిపోయామని. వాస్తవ రూపంలో పరీక్షలు కూడా రాయనీయకుండా వేధిస్తున్నాడని వాపోతున్నారు.

వైసీపీ ప్రభుత్వం సిగ్గుపడాలి...



ఫీజుల రూపంలో విద్యార్థులను వేధిస్తున్న వైసీపీ ప్రభుత్వం సిగ్గుపడాలి. కన్వీనర్ కోటాలో ప్రవేశంపొందిన విద్యార్థుల పూర్తిస్థాయి ఫీజులను ప్రభుత్వమే చెల్లించాలి. గతంలో విద్యార్థులకు సంబంధం లేకుండా కళాశాలలకే నేరుగా ప్రభుత్వం ఫీజులు చెల్లించేది. జగన్ మాత్రం సొంతంగా ఫీజులు ఇస్తున్నట్లు తన పేరుగా పెట్టుకుని బటన్ నొక్కే కార్యక్రమాన్ని చేస్తున్నాడు. అయినా అనేక విడతలను ఎగరగొట్టి విద్యార్థులతోనే ఫీజులు కట్టించాడు.

-కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ముస్లిం రిజర్వేషన్లకు చట్టబద్ధత తెస్తాం

● శాసనమండలి మాజీ అధ్యక్షుడు షరీఫ్ హామీ

● టీడీపీతోనే మైనార్టీలకు న్యాయం : మాజీ మంత్రి కాలవ

● రాయదుర్గంలో ముస్లింల ఆత్మీయ సదస్సు



ముస్లింల ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న ఎంఏ షరీఫ్

రాయదుర్గం, జనవరి 9: ముస్లిం మైనార్టీల నాలుగు శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి తెలుగుదేశం పార్టీ ప్రయత్నం చేస్తోందని శాసన మండలి మాజీ అధ్యక్షుడు షరీఫ్ పేర్కొన్నారు. పట్టణంలోని షాదీమహల్‌లో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సును మంగళవారం నిర్వ హించారు. అంతకుముందు శాంతి నగర్‌లో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కడ నుంచి తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీగా షాదీమహల్‌కు చేరుకున్నాయి. సదస్సుకు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అధ్యక్షత వ హించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ముస్లింలకు ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లకు ఇప్పటికీ చట్టబద్ధత లేదన్నారు. హైకోర్టులో మూడు సార్లు కొట్టేశారని తెలిపారు. ఈ నాలుగు శాతాన్ని ముస్లింలకు అందించాలని తెలుగుదేశం పార్టీ సుప్రీంకోర్టులో పోరాడుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న 10 శాతం మంది ముస్లింలు ఏకతాటిపై వచ్చి తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో 160 స్థానాల్లో టీడీపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెల్లకార్డు ఉంటే చాలు దుల్హన్ పథకం కింద రూ.లక్ష ఇస్తామన్నారు. సీఎం జగన్ తన మీద ఉన్న కేసుల నుంచి బయట పడడానికి బీజేపీకి దాసోహమయ్యాడన్నారు. సీబీఐ కేసుల్లో వాయిదాలకు హాజరు కాకపోయినా బెయిల్ రద్దు కాలేదంటే దీని వెనుక బీజేపీతో ఉన్న బలమైన బంధమే కారణమన్నారు. తన బెయిల్ కోసం జైలు జీవితం లేకుండా ఉండడాన్ని కోసం చిన్నాన్నను చంపిన వాళ్లను కాపాడుకోవడం కోసం తొత్తుగా మారాడని ఘాటుగా విమర్శించారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ మైనార్టీల కోసం టీడీపీ 27 పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వం మైనార్టీల ఆర్థిక స్వాలంబన కోసం కృషి చేసిన దాఖలాలు లేవన్నారు. మైనార్టీ కార్పొరేషన్ నుంచి ఇవ్వాల్సిన సబ్సిడీ రుణాలు ఇవ్వలేదని, షాదీమహల్‌ల నిర్మాణానికి నిధులు కేటాయించలేదన్నారు. దుకాణ్, మకాన్ లాంటి స్కీంలను పెట్టలేదన్నారు. చంద్రబాబు చల్లని పాలన కోసం ప్రతి మైనార్టీ కృ షి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అక్తార్ చాంద్‌బాషా, గ్రంథాలయ మాజీ చైర్మన్ గౌస్, నియోజకవర్గ పరిశీలకురాలు పర్వీన్‌తాజ్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు సాలార్‌బాషా, రిటైర్డ్ ఎస్పీ షేక్షావలి, మైనార్టీ నాయకులు కడ్డిపూడి మహ బూబ్‌బాషా, ఇనాయత్, ఉస్మాన్, జిలాన్, సనావుల్లా, జమీల్‌ఖాన్ పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్‌కు నివాళులర్పిస్తున్న మైనార్టీ నాయకులు

వ్యాపారి చేతిలో మోసపోయిన రైతులు

● న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు

బెళుగుప్ప, జనవరి 9 : వ్యాపారి చేతిలో మోసపోయిన రైతులు న్యాయం చేయాలని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ కళ్యాణదుర్గానికి చెందిన వ్యాపారి హసీన్‌కు తమ మొక్కజొన్న పంటను విక్రయించగా, నగదు చెల్లించకుండా పరారీలో ఉన్నాడని వాపోయారు. మండలంలోని రమణేపల్లి, కాల్వపల్లి, యలగలవంక, విరుపాపల్లి తదితర గ్రామాల రైతులు వ్యాపారి చేతిలో మోసపోయారు. యలగలవంకకు చెందిన రైతు వెంకటేశ్వరరెడ్డి రూ. 3.80 లక్షలు, శివశంకర్‌కు రూ. 15 వేలు, గోవిందుకు రూ.1.40 లక్షలు, రాఘవేంద్రకు రూ. 3.60 లక్షలు, మధుకు రూ. లక్ష వ్యాపారి నుంచి రావాల్సి వుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. రమణేపల్లిలో ఎక్కువ మంది రైతులు మోసపోయినట్లు తెలిపారు. వ్యాపారులపై నమ్మకమే రైతులను నట్టేట ముంచుతోందని, వ్యాపారి కళ్యాణదుర్గానికి చెందిన వ్యక్తి కావడంతో అక్కడే సీఐ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

రేపు ఉద్యోగ మేళా

అనంతపురంరూరల్,జనవరి9: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్‌ఏసీ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 11వతేదిన ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనందరాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌అండ్‌టీ కన్‌స్ట్రక్షన్, బ్లూస్టార్, కేఐఎంఎల్, శ్రీజా మహిళా మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీలు జాబ్‌మేళాలలో పాల్గొంటాయన్నారు. ఎంపికైన అభ్యర్థులు అనంతపురం, బెంగుళూరు, హైదరబాద్, హిందుపురం ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. నెలకు రూ.10వేల నుంచి రూ. 20వేల వేతనం అందిస్తారన్నారు. ఆసక్తిగల వారు బయోడేటా, ఆధార్, విద్యార్హతల పత్రాలతో హాజరవ్వాలన్నారు. ఏపీఎస్‌ఎస్‌డీసీ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, వివరాలకు 8317520929 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

మూన్నెళ్లలో సైకో పాలన అంతం

● చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



అనంతపురం, జనవరి9 (ఆంధ్రజ్యోతి): మరో మూడు నెలల్లో సైకో పాలనకు ప్రజలు అంతం పలకనున్నారని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. సీఎం జగన్ నేతృత్వంలోని నాలుగున్నరేళ్ల కుప్పైబడిన రాక్షస పాలనలో అన్నివర్గాల ప్రజలు బాధితులేనని ఆయన ఆరోపించారు. మంగళవారం అనంతపురంలోని తన నివాసంలో పరిటాల శ్రీరామ్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి అన్నివర్గాల ప్రజలు జగన్ బాధితులుగా మారారని, చివరికి అంగన్‌వాడీల సమ్మెతో చిన్న పిల్లలు సైతం బాధితుల జాబితాలోకి చేరారన్నారు. ఎన్నికలకు ముందు అన్ని వర్గాల ప్రజలకు అనేక హామీలిచ్చారని, ఏరు దాటాకా తెప్ప తగలేసిన చందంగా అధికారంలోకి రాగానే... ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. మాట తప్పను.. మడమ తిప్పను అనే జగన్ సీఎం అయ్యాక అన్నీ తప్పిన నేతగా మారారని ఎద్దేవా చేశారు. ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన జగన్ విధ్వంస పాలన రాజధాని అమరావతిని నాశనం చేసేంతవరకూ కొనసాగిందని, రాష్ట్రం అన్ని విధాలుగా బాగుండాలంటే చంద్ర బాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమవుతుందన్నారు. సైకో పాలనపై విసిగివేజారిపోయిన ప్రజలు చంద్రబాబు చేపట్టిన రా... కదలిరా బహిరంగ సభలకు అశేషంగా వస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ తీసుకొచ్చిన మినీ మేనిఫెస్టోలోని పథకాలపై ప్రజలు హర్షితిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో బీసీల హత్యల పరంపర కొనసాగిందని, ఆ వర్గాలకు చెందిన వేలాది మందిపై అక్రమంగా కేసులు నమోదు చేయించి బీసీల అణిచివేతకు జగన్ ప్రభుత్వం పాల్పడిందని దుయ్యబట్టారు. టీడీపీ అధికారంలోకి రాగానే... ప్రత్యేకంగా బీసీల రక్షణ కోసం ఒక చట్టాన్ని తీసుకు రాబోతున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిన చరిత్ర సైకో ముఖ్యమంత్రిదన్నారు. జగన్ పాలనలో రైతాంగం తీవ్ర అన్యాయానికి గురైందన్నారు. అతివృష్టి, అనావృష్టితో పంటలు నష్ట పోయిన రైతాంగాన్ని ఆదుకునే దిక్కులేకుండా పోయిందన్నారు. ఎన్నికల ముందు ధరల స్థిరీకరణ నిధులంటూ గొప్పలుపోయిన ముఖ్యమంత్రి బాధిత రైతాంగాన్ని ఆదుకోవడంలో విఫలమయ్యా రని విమర్శించారు. ప్రాజెక్టుల విషయంలోనూ జగన్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించ డంలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. చంద్ర బాబు పాలన కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో ఏ ఒక్కరికీ న్యాయం జరగలేదని ఆయన విమర్శించారు.

ఎన్నికల కమిషన్ సమీక్షలో కలెక్టర్, ఎస్పీ

అనంతపురం టౌన్, జనవరి 9: కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ నేతృత్వంలో మంగళవారం విజయవాడలో నిర్వహించిన సమీక్షల్లో జిల్లా కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు. ఎన్నికల కమిషనర్లు అనూప్ చంద్రపాండే, అరుణ్‌గోయల్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో కలెక్టరు గౌతమి, ఎస్పీ అన్బురాజన్‌లు పాల్గొన్నారు. జిల్లాలో ఓటర్లఫిర్యాదులు, వాటిపరిష్కారం, ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఎన్నికల ఏర్పాట్లు గురించి కలెక్టరు ఎన్నికల కమిషన్‌కు వివరించారు. జిల్లాలో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, చెక్‌పోస్టుల అంశాలను ఎస్పీ తెలియజేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

ఫలితాల విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 9: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలల బీటెక్ ఫలితాలను మంగళవారం ప్రిన్సిపాల్ సత్యనారాయణ తనకార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటెక్ తృతీయ, నాల్గవ సంవత్సరం విద్యార్థులకు డిసెంబరులో ప్రథమ సెమిస్టర్(ఆర్20) రెగ్యులర్ పరీక్షలను నిర్వహించామని, విద్యార్థులు ఫలితాల కోసం అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, ప్రొఫెసర్లు భానుమూర్తి, బాల నరసయ్య, డిప్యూటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ విష్ణువర్ధన్, లలిత, విభాగాధిపతులు భారతి, కళ్యాణిరాధ, మారాల రామశేఖర్‌డ్డి, శైలకుమారి పాల్గొన్నారు.

సంస్కృతీసంప్రదాయాల సమ్మేళనం తెలుగుభాష

● అనంత తెలుగు భాషా వైభవ సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు

అనంతపురం సెంట్రల్, జనవరి 9: తెలుగుభాష ఎంతో గొప్పదని, సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జేఎన్‌టీయూ ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో మంగళవారం అనంత తెలుగు భాషా వైభవ సదస్సును ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు, తెలుగు సాహితీమూర్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ 11వ శాతాబ్దంలో తెనుంగు, తెనుగు, తెలుగు భాష స్వరూపం మార్చుకుంటూ తెలుగు పదంగా నామకరణం చేయబడిందన్నారు. నన్నయ, యర్రన, తిక్కన, పోతన, పాల్కూరి సోమన భారతం, రామాయణం వంటి ఇతిహాసాల ద్వారా తెలుగుభాషకు పట్టం కట్టారన్నారు. పోతులూరి వీరబ్రహ్మాన్న, వేమన, గురజాడ అప్పారావు, గుర్రం జాషువా, గిడుగు రామ్మూర్తి తదితర ఆధునిక కవులు తెలుగుని ప్రజల భాషగా మార్చారన్నారు. తదనంతరం సాహిత్యం, మార్క్సిజం, సోషలిజం, ఫ్యూడలిజం, మహారాష్ట్ర దళిత సాహిత్యం, తదితర ఉద్యమాల ద్వారా తెలుగు సాహిత్యం శాఖోపశాఖలుగా విభజన జరిగిందన్నారు. ఈ క్రమంలో భావ, అభ్యుదయ, విప్లవ, స్త్రీ, దళిత, మైనార్టీ, బహుజన తదితర వాదాలుగా విస్తరించి సాంఘిక, అసమానత, వర్గ వివక్షతలను సాహిత్యరూపంలో ప్రజల్లో చైతన్యాన్ని రగిలించింది. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల సమ్మేళనంగా తెలుగు భాష విరాజిల్లుతోందన్నారు. నవలా, కథా, జానపద సాహిత్యం. కవిత్వం, హాస్యం వివిధ ప్రక్రియలపైన రచనలు చేసిన రచయితలు, కవుల సేలను గుర్తించేలా సదస్సును ఏర్పాటుచేయడం హర్షణీయమన్నారు. అనంతరం జీవిత సాఫల్య, ప్రతిభా పురస్కార అవార్డులతో సత్కరించారు. తెలుగు పండిత్ డాక్టర్ శివన్న, తెలుగు ప్రొఫెసర్ నరసింహన్, పరిశోధక విద్యార్థి నల్లబోతుల అరుణ్‌కుమార్, రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, నాగేశ్వరచారి, మధన్‌మోహన్, ఏఈపీ సీఆర్ మీడియా అకాడమీ చైర్‌పర్సన్ శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, టూరిజం అధికారి నాగేశ్వరరెడ్డి, డిప్యూటీ డీఈఓ శ్రీదేవి, డీవీఈఓ వెంకటరమణ నాయక్, జడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ, డిప్యూటీ మేయ ర్లు కొగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, తెలుగు భాషా సేవ ప్రతిభా పురస్కార గ్రహీతలు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న సాహితీ వేత్త దామోదర్ రెడ్డి

టీడీపీతోనే వడ్డెర్లకు గుర్తింపు



రంగనపల్లిలో వడ్డెర్లతో మాట్లాడుతున్న నాయకులు

నంబులపూలకుంట, జనవరి 9: టీడీపీలోనే వడ్డెర్లకు గుర్తింపు ఉంటుందని, దీనిని గుర్తించాలని వడ్డెర సాధికారిక సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తూర్పునడింపల్లి పంచాయతీలోని ఓర్పు వాండ్లపల్లి, రంగనపల్లి, బోదనపల్లి, తాటిమానుగుంత, గడ్డమోళ్లపల్లి గ్రామాల్లో వడ్డేరు సంఘం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ అభ్యర్థిత్వాన్ని బలపరచాలని సూచించారు. టీడీపీలో సామాన్యులకు సైతం రాజకీయంగా న్యాయం జరుగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని కోరారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఉత్తన్న, గంగరాజు, శ్రీనివాసులు, పార్థసారధి, రమణ, మధు, సుదర్శన్‌రెడ్డి, రమణ, శంకర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కుసుమవారిపల్లిలో బాబు ష్యూరిటీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఓబుళదేవరచెరువు, జనవరి 9: మండలపరిధిలోని కుసుమవారిపల్లి, దిగువపల్లిలో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జెరిపిటి ఆంజనప్ప, రాకేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మినీ మేనిఫెస్టోలోని అంశాలను ఇంటింటికీ తిరిగి వివరించారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధి చెందుతుందన్నారు. టీడీపీ విజయానికి ప్రతి ఒకరు కృషి చేయాలని కోరారు కార్యక్రమంలో సాయికుమార్, మునెప్ప, రాకేష్ తదితరులున్నారు.

ఓటర్లుగా నమోదు చేయిస్తాం: ఆర్డీఓ



మర్రిమాకులపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

తాడిమర్రి, జనవరి 9: మండలంలోని మర్రిమాకులపల్లి గ్రామానికి చెందిన ఓటర్లను తిరిగి జాబితాలోకి చేర్చేవిధంగా చర్యలు చేపడుతామని ధర్మవరం ఆర్డీఓ రమేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాడిమర్రి మండలంలోని మర్రిమాకులపల్లి గ్రామంలో స్థానిక తహసీల్దార్ నాగరాజుతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఓటర్ల వివరాలను అడిగితెలుసుకున్నారు. మూడేళ్లక్రితం తమ పేర్లను ఓటరు జాబితానుంచి తొలగించారని తిరిగి ఎక్కడా నమోదు చేసుకోవడానికి అవకాశం ఇవ్వలేదని గ్రామస్థులు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆర్డీఓ వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు.

బాలుర జూనియర్ హాకీ జట్టు ఎంపిక



జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ధర్మవరం, జనవరి 9: హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి 12 వతేదీవరకు తిరుపతిలో జరిగే 14వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ హాకీ పోటీలకు జిల్లా హాకీజట్టును ఎంపిక చేసినట్టు వైస్‌ప్రెసిడెంట్, జిల్లా సెక్రటరీ బంధనాదం సూర్యప్రకాశ్ తెలిపారు. లోకేశ్, మహమ్మద్‌రఫీ, జగన్, ఈశ్వర్, మహబూబ్‌బాషా, బాల ఓబుళేశు, భరత్‌కుమార్, మనోజ్‌కుమార్, అభిషేక్, అనిల్‌కుమార్, దుర్గాప్రసాద్, లవన్‌కుమార్, దయాసాగర్, ఫజులుద్దీన్, కబరీష్‌గౌడ్, రితీష్, వెంకటఅభిషిక్త్, గవ్వల మధు జిల్లాజట్టుకు ఎంపికయ్యారన్నారు. ఇందులో లోకేశ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారన్నారు. జట్టు కోచ్‌గా హుస్సేన్, మేనేజర్‌గా షెక్షావలి వ్యవహరించనున్నారన్నారు. తిరుపతికి మంగళవారం జట్టు వెళ్లిందన్నారు.

అసైన్డ్ భూముల ప్రక్రియ వేగవంతం చేయండి



జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి, జనవరి 9: అసైన్డ్ భూముల ప్రక్రియ వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అధికారులతో అసైన్డ్ భూముల ప్రక్రియపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ చట్టం ప్రకారం నిర్దేశించిన ప్రకారం, నిజమైన లబ్ధిదారులకు భూ యాజమాన్య హక్కులు కల్పించాలన్నారు. ప్రభుత్వమార్గదర్శకాలకనుగుణంగా వీలైనంత త్వరగా భూముల వివరాలు పొందుపరచాలన్నారు. ప్రభుత్వ చట్టాలను, శాసనాలు పక్కాగా అమలు జరగాలని ఆదేశించారు. అసైన్డ్ చేసి 20 యేళ్ల పూర్తి అయిన భూములన్నింటిని 22ఎ నుంచి తొలగించాలని సూచించారు. సమీక్షలో డీఆర్ఓ కొండయ్య అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డీఎడ్ పరీక్షలు

కొత్తచెరువు, జనవరి 9: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా డీఎడ్ పరీక్షలు మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో మంగళవారం కొనసాగాయి. ఈ పరీక్షలను జిల్లా పరీక్షల విభాగపు ఏడీ లాజర్ పరిశీలించారు. ఈ పరీక్షలో ఉమ్మడి జిల్లా నుంచి 39 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారని ఏడీ తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పూర్తిచేశామని, మాస్ కాపీయింగ్ జగరకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష

పుట్టపర్తి రూరల్, జనవరి 9

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లాలోని గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో డీపీఓ మాట్లాడుతూ 32 మండలాల నుంచి 192 మంది పాల్గొన్నారన్నారు. రెండురోజులపాటు సమావేశాలు కొనసాగుతాయన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని గ్రామపంచాయతీల అభివృద్ధి, ఆదాయ వ్యయాలు తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ధర్మవరం డివిజనల్ పంచాయతీ అధికారి శివకుమారి, పుట్టపర్తి ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, డీఎల్‌పీఓ అంజినప్ప, శ్రీకాళహస్తి ఈటీసీ ట్రైనింగ్ అధికారి విద్యారమ, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంతమంది ప్రాణాలు బలి తీసుకుంటారు?

సమగ్రశిక్ష ఉద్యోగుల ధ్వజం

21వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె



జడ్డువాసుదేవరావుకు నివాళులు అర్పిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

పుట్టపర్తిరూరల్, జనవరి 9: రాష్ట్ర ప్రభుత్వం ఇంకెంత మంది ప్రాణాలు బలితీసుకుంటుందని సమగ్రశిక్ష ఉద్యోగులు రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద సమగ్రశిక్ష కాంటాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారానికి 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగ జేఏసీ నాయకులు మాట్లాడుతూ సమగ్రశిక్ష కాంటాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా డిసెంబరు 20వతేదినుంచి సమ్మెచేయడం జరుగుతోందన్నారు. సమ్మెను విఫలం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురిచేస్తోందన్నారు. అనకాపల్లి జిల్లా మునపాక మండల విద్యాధికారి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న 34 సంవత్సరాల జడ్డువాసుదేవరావు తీవ్ర ఒత్తిడి కారణంగా బ్రెయిన్‌స్ట్రోక్‌తో మరణించడం జరగిందన్నారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనన్నారు. 15 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల ఎలాంటి సానుభూతి లేకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం సరికాదన్నారు. తామేమీ గొంతెమ్మ కోరికలు కోరడంలేదని ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీలనే నెరవేర్చమని డిమాండు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికారణంగా మరణించిన జడ్డువాసుదేవరావు కుటుంబానికి రూ. 50లక్షల నష్ట పరిహారం చెల్లించాలని, కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండు చేశారు. సీఐటీయూ జిల్లాప్రధానకార్యదర్శి ఈఎస్ వెంకటేసు, గోరంట్ల, నల్లచెరువు, ఉపాధ్యాయసంఘం జేఏసీ నాయకులు సుధాకర్ రెడ్డి, చాంద్‌బాషా, దామోదర్‌రెడ్డి, లక్ష్మీపతి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఓబిరెడ్డి, నాగరాజు, రవి, ఓబులేసు, హరిప్రసాద్, స్రవంతి, ఈశ్వరి, ఆనంద్, రాజశేఖర్, కృష్ణమూర్తి, కిస్టప్ప తదితరులు పాల్గొన్నారు.

పంగనామాలు పెట్టుకుని గోవిందనామస్మరణ చేస్తూ...





ధర్మవరంలో పంగనామాలు పెట్టుకొని గోవిందనామస్మరణ చేస్తున్న మున్సిపల్ కార్మికులు, పుట్టపర్తిలో...

మున్సిపల్ కార్మికుల నిరసన

ధర్మవరం, జనవరి 9: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని సీఐటీయూ మండల కార్యదర్శి అయూబ్‌ఖాన్ హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 15వ రోజు కొనసాగింది. సమ్మెలో పంగనామాలు పెట్టుకుని గోవిందనామస్మరణ చేస్తూ నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ ఆలవెన్సులు చెల్లించాలని తదితర డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు పోలా లక్ష్మీనారాయణ, మున్సిపల్ కార్మికసంఘం గౌరవసలహాదారులు పెద్దక్క, వెంకటేశులు, సెక్రటరీ చెన్నకేశవులు, కోశాధికారి లక్ష్మీఓబుళేశు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ముకుందా, ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగపు ఉద్యోగ కార్మికసంఘం అధ్యక్షుడు అడ్రామహేశ్, ప్రధానకార్యదర్శి బొగ్గునాగరాజు, సహాయకార్యదర్శి సాకే బాబు, కోశాధికారి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు దాసరిసురేశ్, అంకే పెద్దన్న పాల్గొన్నారు.

పుట్టపర్తి: మున్సిపల్ కార్మికులు మంగళవారం సమ్మె కొనసాగించారు. మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు యూనియన్ నాయకులు నాగార్జున మాట్లాడుతూ వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు రామయ్య, గోవిందు, నరసింహులు, సరోజమ్మ, వెంకటేష్, నారాయణమ్మ, లక్ష్మీదేవి తదితరులున్నారు.

కదిరిఅర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికులు మంగళవారం నామాలుపెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె 14వరోజు కొనసాగింది. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించమన్నారు. సీఐటీయూ నాయకులు జగన్మోహన్, బాబ్‌జాన్, రామమోహన్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కార్మికసంఘం నాయకులు తిరుపాల్, జనార్దన్, బాలక్రిష్ణ, సూరి, రామాంజులు, నరసింహమూర్తి తదితరులున్నారు.

పారిశుధ్య కార్మికుల భిక్షాటన

ఓబుళదేవరచెరువు: వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమై, చివరికి భిక్షాటన చేయాల్సిన దుస్థితి నెలకుందని స్వచ్ఛభారత్, పారిశుధ్య కార్మికులు పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలో కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు శ్రీరాములు, కుళ్లాయప్ప మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు 8 నెలలు, స్వచ్ఛభారత్ కార్మికులకు 13 నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టమైందన్నారు. బకాయివేతనాలు చెల్లించాలని పలుమార్లు ఆందోళనలు, వినతులు సమర్పించినా అధికారులు పట్టించుకోలేదన్నారు. వారి తీరుకు నిరసనగా భిక్షాటన చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు ఆంజనప్ప, కార్మికులు పాల్గొన్నారు.



ఓడీసీలో భిక్షాటన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కొనసాగిన అంగన్‌వాడీల నిరసన



చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ధర్మవరం, జనవరి 9: పొర్లుదండాలు పెడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మంగళవారం నిరసన తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పొర్లు దండాలు పెట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే కక్షసాధింపు చర్యలకు ప్రభుత్వం పూనుకుంటోందన్నారు. ఎస్మా జీఓను విడుదల చేసినా సమస్యలను పరిష్కరించేంతవరకు సమ్మె ఆపమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎల్ ఆదినారాయణ, కార్యదర్శి అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు డిమాండ్‌చేశారు. నిరసనలు చేస్తుంటే వాటిని అణచివేసే ధోరణికి సరికాదన్నారు. ఒంటికాలుపై నిలబడి నిరసన

నంబులపూలకుంట: మండలకేంద్రంలోని బస్‌షెల్టర్‌లో మంగళవారం ఒంటికాలుపై నిలబడి చేతులెత్తి దండం పెడుతూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. 29వరోజులుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించలేదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్‌లోని సీడీపీ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. దండంపెడుతూ నిరసన తెలిపారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ, రంగప్ప, మణిమాల, సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, కుళ్లాయప్ప, శ్రీరాములు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

నల్లమాడ: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 29వరోజు మంగళవారం కొనసాగింది. మండలకేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో కళ్లకు చేయి అడ్డుపెట్టుకుని ఒకచేయి పైకెత్తి వినూత్నంగా నిరసన వ్యక్తంచేశారు. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మెకొనసాగిస్తామని హెచ్చరించారు.

కదిరిఅర్బన్: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. సమ్మెను అణచివేయడానికి ప్రభుత్వం ఎస్మా జీవో తీసుకు తీసుకువచ్చిందని, ఎన్ని తెచ్చినా తగ్గే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు మాబూన్నీషా, చంద్రకళ, లక్ష్మీదేవి, సుజాత, సరోజ, సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు, జగన్మోహన్, బాబ్‌జాన్ తదితరులున్నారు.

తనకల్లు: మండలకేంద్రంలోని చౌడేశ్వరీ ఆలయం వద్ద 29వరోజు మంగళవారం అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రమణ, శివన్న, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు భాగ్యమ్మ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం: జనసేన



పార్టీలో చేరిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

కదిరిఅర్బన్, జనవరి 9: జనసేనపార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పట్టణానికి చెందిన బ్లూమూన్ విద్యాసంస్థల ఛైర్మన్ శివశంకర్, కాపు సంఘం నాయకులు గవ్వల శ్రీనివాసులు, సైదాపురానికి చెందిన కొమ్మినేని చిన్నప్పరెడ్డి అన్నారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సమక్షంలో వారు పార్టీలోకి చేరారు. మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో వారిని సన్మానించారు. జనసేన ఆశయాలు, సిద్ధాంతాల బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో చలపతి, లక్ష్మణ్, జయచంద్ర, రమణ, కల్పన తదితరులున్నారు.

పవన్‌కల్యాణ్‌ను కలిసిన టీడీపీ నాయకుడు



పవన్ కల్యాణ్‌తో సోముశేఖర్


కదిరిఅర్బన్: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను మంగళవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వల్లెపు సోముశేఖర్ కలిశారు. అక్రమకేసుల్లో చంద్రబాబును అరెస్టు చేసి, జగన్మోహన్‌రెడ్డి ఇబ్బంది పెడుతున్న సమయంలో చంద్రబాబును కలిసి టీడీపీకి మద్దతు ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు.

పాసుపుస్తకం కోసం ధర్నా

తనకల్లు, జనవరి 9: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం పాసు పుస్తకం కోసం ఓ రైతు వినూత్నంగా ప్లకార్డులు చేతపట్టుకుని ధర్నా చేశాడు. పట్టాదారు పాసుపుస్తకం కోసం మూడు నెలలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడంలేదని పులికంటి నరసింహులు తెలిపారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం సాగిస్తానన్నారు. తన కుటుంబం హైదరాబాద్‌లో ఉందని, వారు కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. వారిని అక్కడే ఉంచి తాను మూడు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా రెజెక్ట్ చేస్తున్నారన్నారు. ఈ విషయంపై సంబంధిత వీఆర్ఓ నజీర్‌ను ఆంధ్రజ్యోతి సంప్రదించగా వారి కుటుంబ సభ్యులు ఆర్డీవోకు ఫిర్యాదు చేయడంతో రెజెక్ట్ చేశామని తెలిపారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

ధర్మవరం/కొత్తచెరువు/గాండ్లపెంట: పట్టణంలోని మాధవనగర్‌లో మంగళవారం అయోధ్య అక్షింతలు, చిత్రపటాలను పంపిణీచేసినట్టు బీజేపీ రాష్ట్ర చేనేత కార్మికసంఘం సభ్యులు గుండాపుల్లయ్య తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి అక్షింతలతోపాటు రాముని చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కండ అన్నం అరవింద్, బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ చట్టా నారాయణస్వామి, బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరు పుట్లూరు నరసింహులు, ఆర్ఎస్ఎస్ బండి నాగభూషణం, దాసరిరమేశ్ పాల్గొన్నారు. అదేవిధంగా కొత్తచెరువు, గాండ్లపెంటలలో స్వామివారి అక్షింతలను పంపిణీ చేశారు.



కొత్తచెరువు వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బాలకృష్ణను కలిసిన మైనార్టీ నాయకుడు



బాలకృష్ణతో ఇర్షాద్

ఓబుళదేవరచెరువు, జనవరి 9: ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను హిందూపురంలో మంగళవారం టీడీపీ నియోజకవర్గ మైనార్టీ సెల్ కార్యదర్శి గండికోట ఇర్షాద్ కలిశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేయాలని బాలకృష్ణ సూచించినట్లు ఇర్షాద్ తెలిపారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

కదిరిఅర్బన్, జనవరి 9: పట్టణంలో తాగునీటి సరఫరాకు రెండు రోజులపాటు అంతరాయం ఉంటుందని కమిషనర్ శ్రీహరిబాబు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. బుధ, గురువారాల్లో తాగునీటి సరఫరా ఉండదన్నారు. దొరిగిల్లు, మలకవేమల పంప్ హౌస్ వద్ద పైపులైన్ మరమ్మతు జరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

నిందితుల అరెస్టు

కదిరి, జనవరి 9: పట్టణంలోని ఎంజీరోడ్డులో ఆదివారం సాయంత్రం జరిగిన హత్యాయత్నం కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. బాలు అలియాస్ బాలమురళీకృష్ణ, పవన్, షేక్ ఇసాక్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. హిందూపురం రోడ్డులోని కొత్త బైపాస్ వద్ద వారిని అరెస్టు చేసి, వారి నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కదిరిఅర్బన్, జనవరి 9: వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని క బత్తలపల్లితండాకు చెందిన శ్రీరాములనాయక్ తాగుడుకు బానిసై మంగళవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

పురుగుల మందు తాగి..

ధర్మవరంరూరల్: మండలంలోని తుంపర్తి గ్రామానికి చెందిన మనోహర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మనోహర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. ఊరిబయట పొలాల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్సకోసం అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తుచేపట్టారు. మనోహర్ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

వాచ్‌మన్‌కు పాముకాటు

ధర్మవరం, జనవరి 9: పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన అంకన్న మంగళవారం పాముకాటుకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కేశవనగర్‌లోని అయ్యప్పస్వామిఆలయ ఆవరణంలో శుభ్రం చేస్తుండగా ప్రమాదవ శాత్తు పాముకాటుకు గురయ్యాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంకన్న అయ్యప్పస్వామి ఆలయంలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అంకన్న పరిస్థితి నిలకడగాఉందని వైద్యులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

పుట్టపర్తిరూరల్, జనవరి 9: మునిసిపల్ పరిధిలోని ఎనుమలపల్లిలో క్షణికావేశంతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పుట్టపర్తి అర్బన్‌పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎనుమలపల్లి ఎస్సీ కాలనీకి చెందిన తిరుపాల్‌కు కర్ణాటక రాష్ట్రానికి చెందిన అనిత (25)తో 5 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. తాగుడుకు బానిసైన తిరుపాల్, అనిత మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. క్షణికావేశంతో మనస్తాపం చెందిన అనిత ఇంటిలోని రూఫ్‌కు ఉన్న కొక్కీకి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఏడాదిన్నర కూతురు అమ్ములు ఉంది. అర్బన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక

కదిరిఅర్బన్, జనవరి 9: పట్టణంలోని 10, 11వార్డులకు చెందిన యువత మంగళవారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వీరిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షానవాజ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ సిద్ధాంతాలునచ్చి పార్టీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అమీర్‌సాబ్, నీలోఫర్, సౌకత్, మునికుమార్, ఇర్షాన్, నాగేంద్ర, అక్రమ, అస్లం పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

తహసీల్దార్ కార్యాలయం ఎదుట

ఒంటిపై పెట్రోల్ పోసుకున్న వైనం

ముదిగుబ్బ, జనవరి9: తమ పొలం కాజేస్తున్నారనీ, ఆన్‌లైన్‌లో వేరొకరి పేరు ఎక్కిస్తున్నారంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని కొడవండ్లపల్లికి చెందిన నారాయణస్వామి భార్య ఆదిలక్ష్మి మంగళవారం ఆత్మహత్యకు యత్నించింది. ఒంటిపై పెట్రోల్ పోసుకోగా స్థానికులు అడ్డుకున్నారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చింతలరాయుడుకు సర్వే నంబరు 626-2లో ఐదెకరాల భూమి ఉంది. చింతలరాయుడు కుమారుడు నారాయణ స్వామి, కోడలు ఆదిలక్ష్మి ఉన్నారు. ఐదెకరాల భూమిని 40 సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన వెంగముని అనే వ్యక్తికి విక్రయించారు కొన్నాళ్లకు డబ్బు వెనక్కిచ్చేసి పొలం తమకే కావాలని పెద్దల సమక్షంలో అగ్రిమెంట్ రాసుకున్నారు. 1994లో చింతలరాయుడు పేరుమీద డీ పట్టా నమోదు చేశారని బాధితులు ఆరోపించారు. వెంగముని కుటుంబికులు 2020లో రెవెన్యూ అధికారి ద్వారా పాసుపుస్తకాలు చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న నారాయణస్వామి అప్పటి ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లగా వాటిని రద్దు చేశారు. తరువాత 6 నెలలకు ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసినట్లు బాధితులు ఆరోపించారు. మరోసారి ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లగా.. రద్దు చేసినట్లు బాధితులు తెలిపారు. ఈ నేపథ్యంలో 10 రోజులుగా మళ్లీ ఆన్‌లైన్‌లో ఎక్కించే ప్రయత్నం చేస్తున్నట్లు నారాయణస్వామికి తెలిసింది. తమకు న్యాయం చేయాలని మంగళవారం తహసీల్దార్‌ను కోరారు. పదేపదే అధికారులు ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేస్తూ తమకు అన్యాయం చేస్తున్నారంటూ కార్యాలయం ఎదుటే ఆదిలక్ష్మి ఒంటిపై పెట్రోల్ పోసుకుని, ఆత్మహత్యకు యత్నించింది. అక్కడే ఉన్న స్థానికులు ఆమె చేతిలో ఉన్న పెట్రోల్ బాటిల్‌ను లాక్కున్నారు. తహసీల్దార్ నాగేంద్ర వచ్చి న్యాయం చేస్తానని చెప్పడంతో వారు వెనుదిరిగారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచండి

డీఎస్పీ హుస్సేన్‌పీరా


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

పెనుకొండ టౌన్ (సోమందేపల్లి), జనవరి 9 : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచాలని డీఎస్పీ హుస్సేన్ పీరా పోలీస్ సిబ్బందికి సూచించారు. ఆయన మంగళవారం సోమందేపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి కేసుల పురోగతిపై ఆరాతీశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... ఎన్నికలు సమీపిస్తున్నాయని, సమస్యాత్మక గ్రామాలలో నిఘా ఉంచి అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అలజడి సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజారమేష్, ఎస్‌ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

అగళి, జనవరి 9 : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న ఆర్టీటీ భవనంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ ఉమేష్ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 1గంట వరకు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మండలంలోని కంటి చూపులేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అవసరమైన వారికి బెంగళూరులో ఆపరేషన్ చేయిస్తామన్నారు. కంటి అద్దాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జాయేనా..?


అధికారులు నిర్మాణ పనులు ఆపివేయించిన దృశ్యం

పెనుకొండ రూరల్, జనవరి 9 : తమ ప్రభుత్వం ఉందికదా అని ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ కట్టడాలు నిర్మించడం, షెడ్లువేయడం తిమ్మాపురంలో జరుగుతోంది. పెనుకొండ నగర పంచాయతీ తిమ్మాపురంలో ఇందిరమ్మ కాలనీలో పాత జాతీయ రహదారి పక్కన 80సెంట్లు ఎంతో విలువైన స్థలం ఉంది. ఆ భూమిపై వైసీపీ నాయకులు కన్నేశారు. అక్రమంగా షెడ్లు వేసుకుని ఆ భూమిని కాజేసేందుకు పన్నాగం పన్నారు. నగర పంచాయతీ చైర్మన్‌తోపాటు కౌన్సిలర్లు కోఆప్షన్ మెంబర్లు, వారి అనుచరులు ఏకంగా 21మంది ఆ ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా షెడ్లు వేశారు. ఆ భూమిని సొంతం చేసుకునేందుకు యత్నించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో షెడ్లు వేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. మునిసిపల్ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమ కట్టడాలు కట్టకూడదని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం అక్రమ షెడ్డు నిర్మాణాలు వెంటనే ఆపేయాలని ఆదేశాలు జారీచేశారు. ఈ విషయంపై పెనుకొండ నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ బార్గవ్‌ను వివరణ కోరగా తిమ్మాపురం నగర పంచాయతీ పాత జాతీయ రహదారి పక్కన నిర్మిస్తున్న షెడ్ల నిర్మాణాన్ని వెంటనే ఆపేయాలని సిబ్బందిని పంపి పనులు నిలిపివేయించామన్నారు.

దుకాణంలో చోరీ


చోరీ జరిగిన దుకాణం

గోరంట్ల, జనవరి 9: మండలంలోని గుమ్మయ్యగారిపల్లి రహదారి కూడలిలో ఉన్న ఓ దుకాణంలో సోమవారం రాత్రి నగదు, సిగరెట్లు చోరీ అయ్యాయి. చోరీలో నగదుతోపాటు రూ.1.70లక్షల విలువైన వస్తువులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. గుమ్మయ్యగారిపల్లికి చెందిన తల్లీకుతుళ్లు బెస్తనారాయణమ్మ, మణికుమారి కూడలిలో ఉన్న హోటల్‌లోనే చిల్లర దుకాణం నిర్వహిస్తున్నారు. హోటల్ గదికి ఇనుప షట్టర్‌తో పాటు మరో చెక్క తలుపుఉంది. వారు దుకాణానికి తాళం వేసి గ్రామంలోని నివాసం ఉన్న ఇంట్లో ఉండగా, ఈ సంఘటన జరిగింది. గుర్తు తెలియని దుండగులు గునపం సాయంతో చెక్క తలుపును పగలకొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంటిలో భద్రత లేదని హోటల్‌లో దాచి ఉంచిన రూ.లక్ష నగదు, రూ. 70వేలు విలువచేసే సిగరెట్ల బండిల్స్, ఇతర వస్తువులు చోరీ అయినట్లు వారు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ సబ్బ రాయుడు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

పెనుకొండ టౌన్, జనవరి 9: భార్య కాపురానికి రాలేదనే మనస్తాపంతో సోమందేపల్లి మండలపరిధిలోని జూలుకుంట గ్రామానికి చెందిన చంద్రశేఖర్(38) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. జూలుకుంట గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు ఏడేళ్ల క్రితం రొద్దం మండలంలోని బొమ్మిరెడ్డిపల్లికి చెందిన వనజతో వివాహమైంది. ఇరువురూ జూలుకుంట సమీపంలోని కోళ్లఫారంలో పనిచేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే తాగుడుకు బానిసైన భర్తను పద్ధతి మార్చుకోమని పలుమార్లు హెచ్చరించింది. అతడిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో వనజ రెండు నెలల కిందట రొద్దం మండలంలోని సమీప బంధువుల ఇంటికి ఓ శుభకార్యానికి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాలేదు. రావాలని భర్త కోరినా పద్ధతి మార్చుకుంటే వస్తానని తెగేసి చెప్పింది. ఆమె ఇంటికి రాకపోవడంతో మనస్తాపం చెందిన చంద్రశేర్ జూలుకుంట గ్రామ సమీప వ్యవసాయ పొలంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి పిల్లలు లేరు. తండ్రి రామప్ప, లక్ష్మమ్మ ఉన్నారు.

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయండి

తముకూరు జిల్లా కలెక్టర్ శుభకల్యాణ్

పావగడ, జనవరి 9: సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన ప్రజల పట్ల శ్రద్ధ వహించి, చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే సమాజం దృష్టిలో ఉత్తమ అధికారులుగా పేరు పొందుతారని జిల్లా కలెక్టర్ శుభకల్యాణ్ అధికారులకు సూచించారు. పట్టణంలోని ఎస్ఎస్‌కే రంగ మందిరంలో మంగళవారం నిర్వహించిన జనస్పందన కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి వెలిగించి మాట్లాడారు. తుమకూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం రూ. 138 కోట్ల కరవు నిధులు ప్రకటించిందని, ప్రతి తాలూకాలోని రెవెన్యూ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు రైతుల పంటలను సమగ్రంగా పరిశీలించి నివేదిక అందజేస్తే వెంటనే విడుదల చేస్తామని సూచించారు. ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రకటించిన ఐదు గ్యారెంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ఫిర్యాదులు అందించడానికి రైతులు, ప్రజలు, మహిళాసంఘాల సభ్యులు క్యూలో నిలిచి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. జడ్పీ సీఈఓ ప్రభు, జిల్లా అటవీ శాఖాధికారి అనుపమ, ఏసీ రిషి ఆనంద్, తహసీల్దార్ వరదరాజు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. తాలూకా వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన సమస్యలు అధికంగా ఉండటంతో డీసీ వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు.

మంత్రి సభలు వెలవెల

- జనం లేక ఆలస్యంగా ప్రారంభం
- వైసీపీ కార్యకర్తల్లా పోలీసు అధికారులు
- ఖాళీ కుర్చీలు నింపేందుకు ఖాకీ తంటాలు


మంత్రి సభలో జనం లేక ఖాళీగా దర్శనం ఇస్తున్న కుర్చీలు

హిందూపురం, జనవరి 9: రాష్ట్రంలో 80 శాతం మందికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం.... వారంతా మావైపే ఉన్నారని తరుచూ వైసీపీ పెద్దలు చెప్పేమాటలు. కానీ క్షేత్ర స్థాయిలో సంక్షేమ పథకాలు అందుతున్న జనంలో పది శాతం మంది కూడా సంతృప్తిగా లేరనడానికి... హిందూపురం నియోజకవర్గంలో వైసీపీలో నంబర్-2గా పేరుగాంచిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సభలే నిదర్శనంగా నిలుస్తున్నారు. మంత్రి సభలు జనం లేక వెలవెలబోతున్నాయి. సోమవారం జనం కోసం వైసీపీ నాయకులు పడ్డ పాట్లు తెలిసినవే. మంత్రి పెద్దిరెడ్డి రెండోరోజు హిందూపురం మండలంలోని పూలకుంట, కగ్గల్లు, మణేసముద్రం, మలుగూరు, బీరేపల్లి పంచాయతీల్లో సమావేశాలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకే సభ ప్రారంభం కావల్సి ఉండగా, జనం లేని విషయాన్ని తెలుసుకున్న మంత్రి 10గంటలకు వచ్చారు. జనం అంతంత మాత్రమే రావడంతో అరగంటలోపే అందరి ప్రసంగాలు ముగించారు. తెచ్చిన కుర్చీలలో కొన్నింటిని మాత్రమే వేశారు. వాటిలో కూడా కొన్ని కుర్చీలు ఖాళీగానే దర్శనమిచ్చాయి.

వైసీపీ కార్యకర్తల్లా పోలీసులు: ఇదిలా ఉండగా మంత్రి సమావేశానికి జనం రాకపోవడంతో వచ్చిన వారు కూడా మంత్రి ప్రసంగించే సమయంలో వెళ్లిపోతుండటంతో చేసేది లేక వైసీపీ కార్యకర్తల్లా పోలీసు అధికారులు వ్యవహరించిన తీరు అందరినీ విస్మయానికి గురిచేసింది. మంగళవారం పూలకుంటలో జరిగిన సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి ప్రసంగిస్తుండగా కుర్చీలు ఖాళీగా ఉండటంతో పక్కనే నిలబడిన జనాలను కూర్చొబెట్టడానికి ఓ సీఐ పడరాని పాట్లు పడ్డారు. జనం ఎవరూ వెళ్లిపోకుండా ఖాళీ కుర్చీల్లో కూర్చొబెట్టాలని ఎస్‌ఐని కూడా ఆదేశించారు. దీంతో ఎస్‌ఐ కూడా జనాలను కూర్చొంబెట్టేందుకు తంటాలు పడ్డాడు. ఇది చూసిన జనం వీరు పోలీసు అధికారులా..? అధికార పార్టీ కార్యకర్తలా అని నవ్వుకున్నారు?

వెలుగు అధికారులకు వణుకు: హిందూపురం మండలం దక్షిణ ప్రాంతంలోని పంచాయతీల్లో సోమవారం జరిగిన సమావేశాలకు జనం అంతంత మాత్రంగా రావడంతో పారిశ్రామిక వాడ నుంచి మహిళా కార్మికులను బస్సుల్లో తరలించారు. ఇది మీడియాలో రావడంతో అలెర్ట్ అయిన మంత్రి, ఆయన వేగులు... జనం తగ్గకుండా చూడాలని సోమవారం రాత్రే వెలుగు అధికారులను ఆదేశించారు. పెద్దాయన సీరియస్‌గా ఉన్నారని, జనాలు రాకపోతే ఇబ్బంది పడతారంటూ హెచ్చరించారు. దీంతో వారిలో వెన్నులో వణుకు పుట్టింది. మంగళవారం తెల్లవారకనే వెలుగు సిబ్బంది గ్రామాల వెంట పడ్డారు. ఉదయం 6 గంటలకే ఇళ్లవద్దకు వెళ్లి మహిళా సంఘాల సభ్యులకు ఆసరా చెక్కు ఇస్తారని, మంత్రి సమావేశాలకు రావాలంటూ కోరారు. వీరికి తోడు ఓ మండల అధికారి, పంచాయతీ కార్యదర్శులు వైసీపీ నాయకుల కంటే అధికంగా కృషి చేశారు. మంత్రి సమావేశానికి రాకపోతే మీఇండ్లకు నీటి సరఫరా ఆగిపోతుందని పూలకుంట పంచాయతీ కార్యదర్శి హెచ్చరించినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే సమన్వయకర్త సొంత పంచాయతీ బీరేపల్లిలో జనం లేక సమావేశాన్ని ఆలస్యం చేశారు. అయినా జనం రాకపోవడంతో పక్క పంచాయతీలు, పట్టణం నుంచి జనాలను తరలించినట్లు వైసీపీ నాయకులే పేర్కొంటున్నారు.


కుర్చీలు ఖాళీగా ఉండటంతో జనాలను కూర్చోబెడుతున్న సీఐ


మంత్రి ప్రసంగిస్తుండగా వెళుతున్న మహిళలను అడ్డుకుంటున్న వెలుగు సిబ్బంది

పారిశుధ్య కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన


అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

హిందూపురం అర్బన్, జనవరి 9: తమ సమస్యలపై మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె 15వ రోజుకు చేరింది. వారు మంగళవారం పట్టణంలో అర్ధనగ్న ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 15 రోజులుగా సమస్యలపై పోటాటం చేస్తున్నా వైసీపీ ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల ముందు పాదయాత్రలో ప్రస్తుత సీఎం జగన్ మాట్లాడుతూ... పారిశుధ్య, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటామని జగన్ వాగ్దానం చేశారన్నారు. ఇప్పుడు 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ఆయనకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. పారిశుధ్య కార్మికులు లేకపోతే పల్లె, పట్నం కంపు కొట్టి పోతుందన్నారు. కాలువల్లో, చెత్తా చెదారంలో చేతులు పెట్టి కంపును భరిస్తూ కాయకష్టం చేస్తున్న పారిశుధ్య కార్మికులను చిన్న చూపు చూడటం తగదన్నారు. ఆకులు కట్టుకుని అర్ధనగ్న ప్రదర్శ చేసి నిరసన తెలియ జేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే సమ్మె ఉధృతం చేస్తామన్నారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మల్లికార్జున, కార్యదర్శి జగదీష్, కోశాధికారి ఆనంద్, ఉపాధ్యక్షుడు గురునాథ్, వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

వాల్మీకి దేవాలయానికి శఠగోపం వితరణ

హిందూపురం అర్బన్, జనవరి 9: పట్టణ పరిధిలోని వాల్మీకి దేవాలయానికి రూ. 60 వేల విలువైన శఠగోపాన్ని కదిరి పట్టణానికి చెందిన బంగారు క్రిష్ణమూర్తి వితరణగా అందించారు. హిందూపురంలో పురాతన ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి అందులో నూతనంగా శివపార్వతులు, వాల్మీకి, సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి తదితర విగ్రహాలను పునఃప్రతిష్ఠ చేస్తున్నారు. ఇందులో భాగంగా తన వంతు సహకారంగా ఆయన వెండి శఠగోపాన్ని వితరణగా మంగళవారం అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, కోశాధికారి బీఎస్ మూర్తి, దేమకేతేపల్లి అం.నప్ప తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలతో వేడెక్కిన రాజకీయం

ఓ వైపు బాలయ్య మరోవైపు మంత్రి పెద్దిరెడ్డి

హిందూపురం, జనవరి 9 : రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ హిందూపురం నియోజకవర్గంలో సమీక్షలతో ప్రధాన పార్టీలు రెండు వేడి పుట్టిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ హ్యాట్రిక్ కొట్టడం నల్లేరుమీద నడకేనని టీడీపీ నాయకులు భావిస్తున్నారు. భారీ మెజార్టీ కోసం కసరత్తు చేస్తున్నారు. మరోవైపు మంత్రి పెద్దిరెడ్డి స్వయాన పంపిన వైసీపీ సమన్వయకర్త దీపికకు ఎలాగైనా టికెట్ ఇప్పించాలని ఆమె గెలుపునకు బాటలు వేయాలని నానా తంటాలు పడుతున్నారు. అయితే ప్రస్తుత సమన్వయకర్తకు అసమ్మతి పోరు తగ్గలేదు. మరో రెండు గ్రూపుల వారూ వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది అధికార పార్టీ నాయకులే ప్రస్తుత సమన్వయకర్త భర్త చేస్తున్న ఆగడాలు సహించలేక ఈసారి బాలయ్య ఎక్కువ మెజార్టీ సాధించాలని కోరుకుంటున్నారు.

విభిన్నంగా బాలయ్య సమీక్షలు : పదేళ్ల కాలంలో ఎన్నడూలేని విధంగా నంద మూరి బాలక్రిష్ణ సమీక్షలు విభిన్నంగా ఉన్నాయి. గతంలో మండల స్థాయి నాయకులతో సమావేశాలు ఏర్పాటుచేసేవారు. కానీ ఈసారి నియోజకవర్గ వ్యాప్తంగా పంచాయతీలు, వార్డుల వారీగా నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా సమీక్షలు జరిపారు. ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సమీక్షలు జరుపుతూ సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరితో ఫొటోలు దిగుతున్నారు. కార్యకర్తలు ఉత్సాహంగా సమీక్షలకు వస్తున్నారు. బాలయ్య సమీక్షలకు పంచాయతీ అయినా, వార్డుఅయినా జనం మాత్రం తగ్గలేదు. ఊహించిన దానికంటే అధికంగా వస్తుండటంతో వారిని అదుపు చేయడానికి నానా అవస్థలు పడుతున్నారు.

మంత్రి సమావేశాలకు జనం కరువు : తెలుగుదేశం పార్టీ చేపడుతున్న సమీక్షలకు జనం పోటెత్తుతుండగా మంత్రి పెద్దిరెడ్డి సమావేశాలకు వాహనాలు పెట్టి తరలించినా జనం రావడంలేదు. ప్రలోభపెట్టినా, బెదిరించినా సమావేశాలకు అంతంతమాత్రమే హాజరవుతున్నారు. దీంతో టీడీపీకి వస్తున్న ఆదరణ చూసి మనకు ఎందుకు జనం రాలేదని వైసీపీ ముఖ్య నాయకులే ప్రశ్నిస్తున్నారు. బాలయ్యపై మనం విమర్శలు చేస్తున్నా అవి ప్రజల చెవికెక్కడంలేదని వైసీపీ నాయకులే సమావేశాలవద్ద చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రస్థాయిలో సీఎం తరువాత ఆ స్థాయి నాయకుడిగా పేరుగాంచిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పంచాయతీకి వచ్చి సమావేశాలు ఏర్పాటు చేయడం ఆ పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది. ఇలా పంచాయతీ స్థాయిలో మీటింగ్‌లు పెడుతున్నారంటే వారికి టీడీపీపై, బాలయ్యపై ఎంత భయం ఏర్పడిందో అని అనుకుంటున్నారు. మంత్రిచేత పంచాయతీ స్థాయి సమావేశాలు నిర్వహిస్తుండడంపై పలుశాఖల అధికారులు, అధికార పార్టీ నాయకులు అసహనం, ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రీ.. మమ్మల్ని ఎందుకు వేధిస్తున్నావ్?

అంగన్‌వాడీల ఆవేదన

29వ రోజూ కొనసాగిన నిరసన

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డీ... మమ్మల్ని ఎందుకు వేధిస్తున్నావని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెలో కొనసాగుతామని ప్రభుత్వానికి ఖరాకండిగా చెప్పారు. తాము నిరవధిక ప్రారంభించి మంగళవారం 29వ రోజుకు చేరుకున్నట్టు సూచిస్తూ మడకశిర పట్టణం, అగళి, గుడిబండ మండలకేంద్రాల్లో 29 ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల యూనియన్ నాయకులు మాట్లాడుతూ... ఏ ప్రభుత్వమైనా డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకుంటుంది కానీ, ఈ ప్రభుత్వం మాత్రం తమ డిమాండ్లను పరిష్కరించకుండా ఎస్మా చట్టంతో బెదిరింపులకు దిగుతోందన్నారు. తాము న్యాయపరమైన డిమాండ్లను మాత్రమే కోరుతున్నామని, ఆ రోజు ఎన్నికల వాగ్దానాలుగా నెరవేర్చమని అడుగుతున్నామన్నారు. అయినా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా ఎస్మా ప్రయోగించడం దారుణం అన్నారు. దీని పర్యవసానం భవిష్యత్తులో మరోలా ఉంటుందని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. అలాగే హిందూపురం, పెనుకొండ, చిలమత్తూరు, సోమందేపల్లి, లేపాక్షి, రొళ్ల తదితర ప్రాంతాల్లో తమ నిరసనలు కొనసాగించారు.


గుడిబండలో 29ఆకారంలో కూర్చుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


రొళ్లలో గుంజీలు తీస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

చెత్తాచెదారంతో కంపుకొడుతున్న వీధులు

సమ్మెలోనే పారిశుధ్య కార్మికులు


రోడ్లపై పేరుకుపోయిన చెత్తకుప్పలు

పెనుకొండ, జనవరి 9 : పట్టణంలోని వీధులన్నీ చెత్తాచెదారంతో కంపుకొడుతున్నాయి. సమస్యల పరిష్కారం కోసం 12రోజులుగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మె కొనసాగిస్తున్న విషయం విదితమే. దీంతో పారిశుధ్య పనులు కుంటుపడి రోడ్లు, డ్రైనేజీలు చెత్తా చెదారంతో నిండిపోయాయి. వీధులన్నీ కంపు కొడుతున్నాయి. కార్మికుల సమ్మె కారణంగా చెత్తను తొలగించకపోవడంతో ఎక్కడబడితే అక్కడే చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. మురుగు కాలువలు శుభ్రం చేయక పోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ దుర్గంధం భరించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు అధికమై చిన్న పిల్లలు, వృద్ధులు రోగాలబారిన పడుతున్నారు. నగర పంచాయతీ అధికారులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె కారణంగా పట్టణంలో పారిశుధ్య పనులు కుంటుపడ్డాయి. దీంతో తాత్కాలిక సిబ్బందిని నియమించాం. అయితే వారు చెత్త తొలగించడానికి వెళ్తే సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుపడుతున్నారు. పోలీసుల సహకారంతో వీధులన్నీ శుభ్రం చేయిస్తాం.

- వంశీకృష్ణ భార్గవ, మునిసిపల్ కమిషనర్

కొనసాగిన బాలయ్య సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న బాలక్రిష్ణ

హిందూపురం, జనవరి 9: ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ చేపడుతున్న సమీక్ష మంగళవారం కొనసాగింది. హిందూపురం పట్టణంలోని 1నుంచి 15వార్డుల వరకు వార్డుల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా బాలక్రిష్ణ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి ఎంతో కీలకమైనవన్నారు. భవిష్యత్ తరాలకు ఈ ఎన్నికలు కీలకంగా మారనున్నాయని, అనుభవం ఉన్న చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడం మన బాధ్యత అన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుల్లా పనిచేయాలన్నారు. సుమారు 2వేల మందిదాకా నాయకులు, కార్యకర్తలతో ఫొటోలు దిగారు. 8వ వార్డులో లేపాక్షి - హిందూపురం ప్రధాన రహదారిలో శ్రీకంఠపురం వద్ద బ్రిడ్జి నిర్మాణం గురించి ఆ వార్డు ప్రజలు బాలయ్య దృష్టికి తీసుకెళ్లగా ఆ ప్రాంత ప్రజలకు రోడ్డు సౌకర్యాకి కృషిచేస్తానన్నారు. పదోవార్డు టీడీపీ నాయకుడు మాజీ జవాన్ సుబ్రహ్మణ్యంపై గత మునిసిపల్ ఎన్నికల సందర్భంగా అక్రమ కేసు బనాయించడాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబికాకు ఎంపీ టికెట్ ఇవ్వాలని వినతి


బాలయ్యకు వినతిపత్రం అందిస్తున్న రూరల్ మండల నాయకులు

హిందూపురం, జనవరి 9 : టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణకు ఎంపీ టికెట్ ఇవ్వాలని హిందూపురం రూరల్ మండలం టీడీపీ నాయకులు ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణకు వినతిపత్రం అందించారు. సోమవారం రాత్రి రూరల్ మండల నాయకుల సమీక్ష అనంతరం మండలం ముఖ్యనాయకులు బాలయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబికా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని, పార్టీ అభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు. ముఖ్యంగా వైసీపీ తరుపున బోయ సామాజిక వర్గం నుంచి మహిళకు టికెట్ కేటాయించారన్నారు. మన పార్టీలోను వాల్మీకులకు కేటాయిస్తే బాగుంటుందని కోరారు. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని నాయకులకు బాలకృష్ణ చెప్పినట్లు రూరల్ మండల నాయకులు తెలిపారు.

అంగన్‌వాడీల సమ్మెపై జగన్ నియంతృత్వ పోకడ: బీకే

పెనుకొండ, జనవరి 9 : సమస్యల పరిష్కారం కోరుతూ 29 రోజులుగా అంగనవాడీలు సమ్మె చేస్తున్నా పట్టించుకోకుండా... సమ్మె అణిచి వేయడానికి జగన్ ప్రయత్నించడం ఆయన నియంతృత్వ ధోరణికి నిదర్శనమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి విమర్శించారు. ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమ్మె చేస్తున్న అంగన్ వాడీలు అత్యవసర సేవకులని, వారు సమ్మె చేయడం నిషిద్ధమని పేర్కొంటూ వారిపై ఎస్మా ప్రభుత్వం ప్రయోగించిందన్నారు. అయితే అత్యవసర సేవలు అందించేవారికి కనీస వేతనాలు ఇవ్వాలన్న జ్ఞానం జగన్‌కు లేదా అని ప్రశ్నించారు. వెంటనే కుటుంబ నాటకానికి తెరదించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలన్నారు. అంగనవాడీలపై ఎస్మా ప్రయోగించడం జగన్ నిరంకుశ పెత్తందారి పోకడలకు నిదర్శనమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగనవాడి మహిళలు సమ్మె చేస్తుంటే గంట సమయం కేటాయించక పోవడం శోచనీయమన్నారు. జీఓలతో అంగన్‌వాడీల న్యాయ పోరాటాలను అడ్డుకోలేరని తక్షణమే జీఓ-2ను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. వారి పోరాటానికి టీడీపీ సంపూర్ణ మద్దతు తెలుతోందని అంతిమ విజయం అంగనవాడీలదేనన్నారు. ఒక్కో అంగనవాడీ కార్యకర్త అపరకాళిగా మారి జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి పంపడం ఖాయమన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీపై టీడీపీ ప్రచారం


బాబు ష్యూరిటీ పత్రాలను కాలనీ వాసులకు అందజేస్తున్న టీడీపీ నాయకులు

మడకశిర రూరల్, జనవరి 9: రాష్ట్రం సర్వోతో ముఖాభివృద్ధి చెందాలంటే టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు తిమ్మరాజు, కౌన్సిలర్ ఉమాశంకర్, యూనిట్ ఇన్‌చార్జ్ రవిబాబు పేర్కొన్నారు. వారు మంగళవారం పట్టణంలోని 13,14 వార్డులలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆయా వార్డులలో ప్రతి ఇంటికి వెళ్లి సంబంధిత కరపత్రాలను అందజేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లోటి బద్రీ, చంద్ర, సోము, ప్రకాశ్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు జేఏసీ మద్దతు

గోరంట్ల, జనవరి 9: తమ డిమాండ్ల సాధనకు 21 రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు జిల్లా కేంద్రంలో చేపట్టిన సమ్మెకు గోరంట్లకు చెందిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంగళవారం మద్దతు తెలిపినట్లు జేఏసీ గోరంట్ల నాయకులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తున్న ఉద్యోగులకు ఒకరోజు భోజన వసతి కల్పించడానికి రూ. 20వేలు ఆర్థికసాయం అందించామన్నారు. అలాగే గోరంట్ల మండలానికి చెందిన ఎస్ఎస్ఏ ఉద్యోగులకు, సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు ఆర్థికసాయం చేశామని తెలిపారు. ఉపాధ్యాయ జేఏసీ నాయకులు దామోదర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మురళీ, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.